# కూటసాక్షి

గణపతి తాపీమేస్త్రి. ముప్పయి అయిదు సంవత్సరాలుంటాయి. ఎర్రగా, సన్నగా, పొడుగ్గా ఉంటాడు. మా సీనియరుకు అతను చాలా సంవత్సరాల నుండి తెలుసు. మా సీనియర్ ఇంట్లోని ఏపనయినా గణపతే దగ్గరుండి చేయిస్తుండేవాడు. అప్పట్లో అతనిలో నాకు నచ్చిన విషయం ఏమిటంటే అతని నవ్వు ముఖం. అతను అందగాడు కాదు. నవ్వే అతనికి అందంలా ఉండేది. మాటల్లో కూడా మన్నన ఉండేది. అతను కోపంగా ఉండడం నేనెప్పుడూ చూడలేదు.

అతని తల్లి వెంకాయమ్మ కేసు మా సీనియరు నాకు ఇచ్చి ఉండకపోతే అతనితో నా పరిచయం ఎక్కువయి ఉండేదికాదు. అతన్ని అర్థం చేసుకోవడం తేలికనిపించలేదు. అతని భార్య రమాదేవి చనిపోయేనాటికి ఆమె వయసు ముప్పయి సంవత్సరాలు. ఆమె గణపతి వాళ్ల బంధువుల అమ్మాయే. రమాదేవిని ఎంతో ఇష్టపడి వెంకాయమ్మ తన కోడలిగా తెచ్చుకుంది. అత్తా కోడళ్ల మధ్య ఎటువంటి పొరపొచ్చలు ఉండేవి కావు. భార్యాభర్తలు కూడా అన్యోన్యంగా ఉండేవాళ్లు. పెళ్లయిన సంవత్సరానికి రమాదేవికి బాబు పుట్టి, పుట్టిన మూడోరోజునే చనిపోయాడు. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలు గడిచినా వాళ్లకు పిల్లలు కలగలేదు. ఆమె బతికి ఉండగా ఏదో సందర్భంలో మా సీనియరు దగ్గరకు వచ్చినప్పుడు ఒకసారి చూశాను. చక్కటి మనిషి. కాలిపోయాక ఫొటోల్లో చూశాను. భయంకరంగా ఉంది.

వాళ్ల సంసారం ఎంతో సవ్యంగా సాగుతున్న సమయంలో రమాదేవి అగ్నికి ఆహుతి అయింది. తొంభయి శాతం కాలిపోయింది. మరణవాంగ్మూలంలో, 'నా అత్త అయిన వెంకాయమ్మ నామీద కిరసనాయిలు పోసి నిప్పంటించింది. తను వంటగదిలోంచి బయటకు రాకుండా తలుపు మూసేసరికి నేనెటూ వెళ్లలేకపోయాను. నాతో ఆమెకు విరోధం లేదు. నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేది. మాటా మాటా

కూడా ఎప్పుడూ అనుకోలేదు. నా మీద ఇంత కక్ష పెట్టుకుంటుందని నేను ఊహించలేదు. ఎందుకిలా చేసిందో కూడా నాకు అర్థం కావడం లేదు' స్పష్టంగా, స్పృహలో ఉండే అంది. వాంగ్మూలం రెండుసార్లు రికార్డయినా మాట పొల్లుపోలేదు. ఆరేడు గంటలు భయంకరమయిన బాధ అనుభవించిందని విన్నాను. చనిపోయే ముందు ఏదో చెప్పడానికి ప్రయత్నం చేసిందని, మాట పడిపోవడం వలన ఏమీ చెప్పలేకపోయిందేమో, చేతులతో సంజ్ఞలు చేస్తోంటే ఎవరికీ అర్థం కాలేదట అని కూడా విన్నాను. వెంకాయమ్మను రమాదేవి దగ్గరకు వెళ్లనీయలేదు. అరెస్టు చేసి జయిల్లో పెట్టారు.

ఇటువంటి కేసులు సాధారణంగా మా సీనియరు తీసుకుంటుంటాడు. ఆయనకు గణపతి బాగా తెలుసుకాబట్టి కేసు ఆయనే తీసుకుంటాడనే అనుకున్నాను. ఆయన నాకు అర్థం అయినట్టే ఉంటాడు కాని అర్థం కాడు. తను గెలవగలనన్న కేసు కాదనుకుని ఉంటాడు. నాకు దొరికే వాళ్ల దగ్గర నుండి ఫీజు రాబట్టుకోవడం కష్టంగానే ఉంటుంది. మా సీనియరు తీసుకోకుండా కేసు నాకు ఇవ్వడం గణపతికి కూడా నచ్చలేదు. ఏమొహమాటం లేకుండా ఆ మాట నాతోనే అన్నాడు. నవ్వేసి ఊరుకున్నాను.

కేసు మొదలయింది. మరణ వాగ్మూలం ఇనపకోటలా ఉండడం వలన ప్రాసిక్యూషన్ పటిష్టంగా ఉంది. కష్టపడితే అనుకూలత సాధించవచ్చని ఆశ ఉంది.

వెంకాయమ్మతో ఆరేడుసార్లు మాట్లాడాను. ఆమెకు యాభయి అయిదు సంవత్సరాలుంటాయి. ఎంత ప్రయత్నించినా నాకు ఆమె నుండి సరయిన సమాధానం రాలేదు. ఏదో దాస్తున్నట్టు అనిపించేది. ఆమె ఏ కొద్దిగా సహకరించినా తనకు తను సహాయం చేసుకున్నట్టుగా ఉండేది. నాకూ ఉపయోగంగా ఉండేది.

ఆమెకు గణపతి ఒక్కడే కొడుకు. భర్త చనిపోయి పదేళ్లు గడిచాయి. గత అయిదు సంవత్సరాల నుండి గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడ్డాయి. స్టెంటులు పెట్టాలని డాక్టర్లు సూచించారు. పెట్టించుకోలేదు. కారణమేమిటో తెలియదు. అడిగినా చెప్పలేదు. ఉపశమనం కోసం మందులు వాడుతోంది. మందులకు బాగానే ఖర్చు అవుతోంది.

వెంకాయమ్మ బాగానే బతికిన మనిషి. గణపతికి తక్కువేం చేయలేదు. అతన్ని చదివిద్దామని ఎంతో ప్రయత్నించింది. గణపతికి చదువు అబ్బలేదు. ఈ దారిలోకి వచ్చాడు. ఆమె తన పేరన ఉన్న డాబాను కొడుకు పేరన రాసిచ్చేసింది. తనకున్న బంగారమంతా కోడలికిచ్చేసింది.

ఆ బంగారమంతా ఏమయిందో, ఎక్కడుందో వెంకాయమ్మకు తెలియదు. ఇంట్లో మటుకు లేదు. ఆ సంగతి గణపతిని అడగాలని నాకు అనిపించలేదు.

నా మాటుకు నాకు వెంకాయమ్మ రమాదేవిని చంపాల్సిన కారణం ఏమీ కనిపించలేదు. ఆ పని ఆమె చేసి ఉండదు. చేయవలసిన అవసరం లేదు. కారణం తెలుసుకుంటే నాకు ఆధారం దొరుకుతుందని ఆమె ఇంటి చుట్టుపక్కవాళ్లను అడిగాను. వెంకాయమ్మ గురించి మంచిగానే చెప్పారు. కొడుక్కి సంతానం లేదని బాధపడుతుండేది. ఆ విషయంలో కోడల్ని సూటిపోటి మాటలు, నవ్వులాటగానయినా అనేది కాదు. ఎవరయినా అడిగితే, "వయసు మించిపోతోందేంట్రా, తొందరేమిటి?" అని కోడలి మీద ఈగ వాలనిచ్చేది కాదు. కాకపోతే కొడుక్కి ఏంకావాలో కోడలు కన్నా రెండడుగులు ముందుగానే అందించేది. అదే ఆమె చేసిన పొరపాటేమో!

ప్రాసిక్యూషన్ పట్టు ఆమె చుట్టూ అల్లుకుంటోంది. రమాదేవి కాలిపోయిన రోజున కేన్ నిండా కిరసనాయిలు కొన్న ఋజువు ఉంది. పోలీసులు తీసుకువచ్చిన సాక్షి రమాదేవి గదిలో కాలిపోతోంటే వెంకాయమ్మ తలుపు మూసి గడియపెట్టడం చూశానని కోర్టులో చెప్పాడు. పోలీసులు గట్టి సాక్ష్యాలనే సంపాయించారు. అందరినీ మించి గణపతి చిన్నాన్న సాక్ష్యం ఆసక్తికరంగా ఉంది. అత్తా కోడళ్లు రోజుకు కనీసం మూడుసార్లయినా పోట్లాడుకునే వాళ్లనీ, వెంకాయమ్మ రమాదేవిని మానసికంగా సతాయించేదని రమాదేవి బతికి ఉండగా ఏడుస్తూ చాలాసార్లు తనతో చెప్పిందని చెప్పాడు. అతన్ని క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలనిపించలేదు. ఆ తర్వాత నాకు తెలిసిందేమిటంటే అతను వెంకాయమ్మకు యాభయివేలు వరకు బాకీ ఉన్నాడట. ఆ బాకీ తాలూకు రాతకోతలేమీ లేవు. అంతే కాకుండా వంటగదికి అవతలివయపు మరో తలుపు ఉంది. దాని ద్వారా కూడా బయటకు వెళ్ళొచ్చు.

గణపతి నలుగురు దొంగ సాక్షులను నా దగ్గరకు తీసుకువచ్చాడు. దొంగ సాక్ష్యాలను చాలా మంది ఉపయోగించుకుంటూ ఉంటారు. ఈ విషయం జడ్జిలకు కూడా తెలుసు. "వీళ్ళు మన తరఫు సాక్షులుగా ఉంటారు. కోర్టులో ఏ ప్రశ్నలు అడుగుతారో, వీళ్ళేం జవాబు చెప్పాలో వీళ్ళకు చెప్పండి" అన్నాడు.

"వాయిదాలు పడినప్పుడల్లా వస్తుండాలి" అన్నాను.

"వస్తారు".

"వీళ్లు సాక్ష్యం చెప్పడానికి ఏమయినా ఇవ్వాలికదా?"

"ఇవ్వాలి".

"వీళ్లు మీ ఇంటి చుట్టుపక్కలవాళ్లా?"

"కాదు".

ఎందుకనో ఇంటి చుట్టుపక్కల వాళ్లెవరూ వెంకాయమ్మ తరఫున సాక్ష్యం ఇవ్వడానికి ముందుకు రాలేదు. చాలామంది అబద్ధం చెప్పినంత నిర్భయంగా నిజం చెప్పరు.

"సాక్ష్యం చెప్పడానికి వీళ్లకు ఏమయినా ఇవ్వాలి కదా?" అన్నాడు.

"ఇవ్వొద్దూ మరి?" అన్నాను.

"మీరు సర్దలేరా?"

"నేనెందుకు సర్దాలి?"

"కేసు మీరు వాదిస్తున్నారు కదా?"

"కేసు నామీద లేదు. నేను వాదిస్తున్నాను. అంతే. ఇది హత్యానేరం కేసు గణపతీ, ఇప్పటి వరకు నాకెంత ఇచ్చావు?"

తడుముకోకుండా సరిగ్గా చెప్పాడు. అతనికి అన్నీ గుర్తే.

"తక్కువే కదా?" అన్నాను.

"తక్కువే. కేసు అయిపోయిన వెంటనే ఎంతివ్వమంటారో అంత ఇచ్చేస్తాను."

ఇవన్నీ మాటలు. కేసు గెలిచినా, ఓడినా వీళ్లు మాకు కనపడరు. తప్పించుకుని తిరుగుతుంటారు.

"మీ అమ్మ కేసులోంచి బయటకు రావడం నీకు ఇష్టం లేదా?" కోపంగానే అడిగాను.

"ఎందుకు లేదు సార్? ప్రస్తుతానికి నా దగ్గర ఏమీలేదు. సాక్షులకు నేను ఎంతో కొంత ఇచ్చుకుంటాను లెండి. తప్పుతుందా?"

గణపతికి తాపిమేస్త్రీగా మంచి పేరే ఉంది. సంపాదన కూడా బావుంది. డబ్బు దగ్గర ఎందుకు వెనకాడుతున్నాడో నాకు అర్థం లేదు. అతని కేసు మా సీనియరు తీసుకోకపోవడానికి ఇదొక కారణమయి ఉంటుందేమో! రమాదేవి మరణానికి వెంకాయమ్మ ప్రమేయం అసలు లేదని నమ్ముతున్నాను. నా ప్రయత్నపు ముడులు ఎక్కడికక్కడ బిగుసుకుపోతున్నాయి.

కేసు నడుస్తోండగా గణపతి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. కట్నం బాగా తీసుకున్నాడని విన్నాను. పెళ్లికి మా సీనియరును పిలిచాడు. ఆయన వెళ్లలేదు.

నన్ను పిలవలేదు. పెళ్లయిన తర్వాత కాని ఆ విషయం వెంకాయమ్మకు తెలియలేదు.

మా తరపు సాక్షులు నేను చెప్పిన దానికన్నా బాగా చెప్పారు. ఒక అమాయకురాలిని రక్షించబోతున్నానని సంతోషం కూడా వేసింది. ఆ సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. చివరి సాక్షిగా వచ్చిన గణపతి, "మా అమ్మ నా మొదటి భార్య మీద కిరసనాయిలు పోసి అగ్గిపుల్ల వెలిగించడం నా కళ్లారా చూశాను" అన్నాడు. కేసులోంచి తన తల్లిని తప్పిద్దామని ఎంతో తాపత్రయపడి తీరా కోర్టులో అలా చెప్పేసరికి సగం చచ్చిపోయాను. కోర్టు గదిలోంచి బయటకు వచ్చి ఏ చెట్టు కిందో కూర్చుని ఏడుద్దామనిపించింది. బొత్తిగా నేను ఊహించని విషయం. జడ్జి కూడా నమ్మలేనట్టు గణపతిని మరోసారి అడిగినప్పుడు గణపతి అదే జవాబు చెప్పినప్పుడు, "నువ్వెందుకు అడ్డుకోలేదు?" అడిగాడు.

గణపతి జవాబు చెప్పలేదు.

వెంకాయమ్మ మీద ఉచ్చు బిగుసుకుపోయింది. జన్మ ఖైదు విధించారు.

ఈ కేసులో నాకు ఎదురయిన సందేహాలకు ఎక్కడి నుండీ సమాధానాలు అందలేదు. రమాదేవి చనిపోవడానికి కారణం తెలుసుకోడానికి నేను పడిన కష్టం నేలపాలయి పోయింది. ఆ కారణం వెంకాయమ్మకు తెలిసి ఉండాలి. ఆమె నోరు విప్పలేదు.

తీర్పు విన్న వెంటనే గణపతి కోసం వెతికాను. కనబడలేదు. వెంకాయమ్మను పోలీసులు బయటకు తీసుకు వస్తున్నప్పుడు పోలీసు వేను దగ్గర ఆమెను కలిశాను. చేతులు జోడించి నాకు నమస్కరించింది. ఆమె ముఖం ప్రసన్నంగా ఉంది. ఏ భావోద్వేగాలు అవుపించడం లేదు. "జన్మఖైదంటే ఎన్ని సంవత్సరాలు ఉండాల్సి ఉంటుంది?" అడిగింది. అది కూడా తెలియని అమాయకురాలికి వివరించబోయాను. గొంతులోంచి మాట పెగిలిరాలేదు. "నా గుండె జబ్బుకూ, చక్కర వ్యాధికి మందులు కావాలంటే నేనేం చేయాలి?" అడిగింది.

ముంచుకొస్తున్న అనారోగ్యానికి ఏమాత్రం ఖర్చు పెట్టడం ఇష్టం లేకనో, కొత్త భార్య అందుకు ఒప్పుకుంటుందో, లేదో అని గణపతి తల్లికి ప్రతికూలంగా సాక్ష్యం చెప్పాడా? ఏమో!

❖ **ఆదివారం వార్త, 6 జూలై 2008**